కనుల పండువగా రథసప్తమి

● భక్తిశ్రద్ధలతో పూజలు

మదనపల్లె సిటీ : మదనపల్లె క్లస్టర్ పరిధిలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మదనపల్లెలోని దేవళంవీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వెంకన్న సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు గోవర్ధన్‌భట్టార్, బాలాజీ ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ మాజీ కమిటీ చైర్మన్ బింగి పాండు, సభ్యులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ఉదయం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చన, తోమాలసేవ, అభిషేకం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన శ్రీ పట్టాభిరాముడిని పుష్పపల్లకిపై అధిరోహింపజేసి, పట్టణంలోని నాలుగుమాఢ వీధుల్లో ఊరేగించారు. అలాగే సూర్య భగవానుడికి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది దుశంత్, భక్తులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, శ్రీవెంగమాంబ ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అందంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో గ్రామ వీధుల మీదుగా ఊరేగించారు. గుర్రంకొండ పట్టణంలోని పలు ఆలయాల్లో స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


మదనపల్లె సిటీ: సూర్యప్రభ వాహనంపై వెంకన్న


గుర్రంకొండ : తిరుచ్చి ఉత్సవం


వాల్మీకిపురం: శ్రీ పట్టాభిరాముడిని ఊరేగిస్తున్న భక్తులు

తేరుపై శ్రీనివాసుడి ఊరేగింపు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో 8 రోజులుగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అర్చకులు క్రిష్ణప్రసాద్‌బట్టార్, రాఘవేంద్రస్వామి, రమేష్‌బాబులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని తేరుపై ఆశీనులు చేశారు. సంప్రదాయ బద్ధంగా పుర వీధుల్లో తేరుపై ఊరేగింపు జరిగింది. స్వామి వారి తేరు లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రాత్రి స్వామి వారిని గజవాహనంపై అలంకరించి కనువిందు గొలిపే విధంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు చేశారు. గోవందమాల ధరించిన భక్తులు నియమ,నిష్ఠలతో ఇరుముడితో ఆలయానికి వచ్చి స్వామికి చెల్లించి పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు శామలమ్మ, కోటిరెడ్డి, రఘునాథ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


తేరుపై ఊరేగుతున్న స్వామివారు


ఇరుముడితో వచ్చిన గోవిందమాల భక్తులు

రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక

కలకడ : రాష్ట్ర స్థాయి పోటీలకు కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడంతో డీఈఓ రాఘవరెడ్డి జిల్లా మొదటి బహుమతిని, ప్రశంస పత్రంను అందించినట్లు కలకడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లీ తెలిపారు. 27, 28 తేదీలలో రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌లో కలకడ ఆదర్శపాఠశాలలో 9వ తరగతి విద్యను కొనసాగిస్తున్న అబ్బూరి రుచిత ఎన్విరాల్‌మెంట్ అండ్ క్లెమైంట్ చేంజ్ -కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాజెక్ట్ రూపంలో చేసి చూపి జిల్లా మొదటి స్థానం సాధించి, రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు డీఈఓ ప్రకటించారని తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ప్రాజెక్ట్ గైడ్ షర్ఫుద్దీన్‌ను అభినందించారు.

గురుచరణ్‌కు రాష్ట్ర స్థాయి బహుమతి

బి.కొత్తకోట: మండలంలోని గట్టు జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గురుచరణ్ రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపికైనట్లు ఎంఈవో రెడ్డిశేఖర్, హెచ్‌ఎం లలితకుమారి తెలిపారు. శనివారం జిల్లా స్థాయి సైన్ మేళా జరిగింది. ఈ మేళాలో గిరిజన వాసులకు పశువుల కాపరులకు వెదురుకర్రతో బహుళ ప్రయోజనాలు అనే అంశంపై గురుచరణ్‌ను బహుమతికి ఎంపిక చేసినట్టు వారు పేర్కొన్నారు.


డీఈఓ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

వైద్య సిబ్బందికి శిక్షణ

మదనపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలలో పని చేస్తున్న మిడ్‌లెవెల్ ప్రొవైడర్లు, వెల్‌నెస్ సెంటర్ సీహెచ్‌ఓలు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తెలిపారు. శనివారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగిన శిక్షణ కార్యక్రమాల ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిడ్‌లెవెల్ వర్కర్స్, సీహెచ్‌ఓలు తమకు కేటాయించిన విధులతోపాటు, ప్రభుత్వం తాజాగా అప్పగించిన మరో ఐదురకాల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు 5 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బ్యాచ్‌ల వారీగా మిగతా వారికి సైతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రజలకు వైద్యసేవల రూపంలో అందించాలన్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. మిడ్‌లెవెల్ వర్కర్స్, సీహెచ్‌ఓలు ఉమ్మడిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, మెడికల్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ, శిక్షణా అందించిన వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ దివాకర్, శిక్షణ అందించిన వైద్యులు రమేష్‌బాబు, రిజ్వాన్, చిన్నరెడ్డెప్ప, టీబీ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు స్థల పరిశీలన

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు స్థలాన్ని సర్పంచ్ హబీబ్‌బాషా, పంచాయతీ రాజ్ డీఈ భాస్కర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి డంపింగ్ యార్డు స్థలం లేకపోవడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారి సూచన మేరకు జిల్లా కలెక్టర్ స్పందించి పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ సర్వే నంబరు 511లో పదెకరాల స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించినట్లు తెలిపారు. సర్వేయర్ రామాంజులు సంబంధిత స్థలానికి హద్దులు చూపించడం త్వరలో చదును చేసి ప్రహరీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెంగల్‌రాయుడు, నాయకులు మగ్బుల్, మునీర్, అబీద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తేవాలి

గుర్రంకొండ : గుర్రంకొండలోని డంపింగ్‌యార్డును వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. శనివారం మండలంలోని గుర్రంకొండ, నడిమికండ్రిగ, చెర్లోపల్లె గ్రామాల్లోని డంపింగ్‌యార్డులను జగనన్న స్వచ్ఛసంకల్ప కార్యక్రమంలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. చెర్లోపల్లె, నడిమిఖండ్రిగ గ్రామాల్లో వినియోగంలో ఉన్న డంపింగ్‌యార్డులో పొడిచెత్త, తడిచెత్తలను ఎప్పటికప్పుడు వేరుచేయాలని సూచించారు.

జేఎస్ఎస్‌లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుర్రంకొండలో గతంలో కాలిపోయి ప్రస్తుతం మళ్లీ నిర్మిస్తున్న డంపింగ్ యార్డును పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరలోనే వినియోగంలోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్, మణికుమార్ పాల్గొన్నారు.


డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కలం యోధులను స్మరించుకోవాలి

పీలేరు రూరల్ : కలం అమలవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కడప యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్యోద్యమంలో జర్నలిస్టుల పాత్ర అన్న అంశంపై రెండోరోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైనికులు, పోలీసులు తమ ప్రాణాలు పణంగా పెట్టి దేశ ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారని తెలిపారు. అదే క్రమంలో అంతర్జాతీయ నివేదిక ప్రకారం ప్రతి ఏడాది సుమారు 900 మంది పాత్రికేయులు ప్రాణాలు కోల్పోవడం, కన్పించకుండా పోవడం బాధాకరమని తెలిపారు. జర్నలిస్టులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ప్రాత్యం పరిశోధనా సంస్థ ఆచార్య బీసీ వెంకటేశ్వర్లు, డాక్టర్ వాసు, డాక్టర్ ఈశ్వరబాబు, డాక్టర్ యువశ్రీ, సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : తపాలా శాఖ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి తపాలా శాఖ ఎస్ఎస్‌పీ జాఫర్ సాదిక్ అన్నారు. శనివార పీలేరు పోస్టాఫీసు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏక్ దిన్ ఏక్ క్రో (ఒక రోజులో ఒక కోటి) ఖాతాలు దేశ వ్యాప్త కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఒక్క పీలేరు డివిజన్‌లో 1700 ఖాతాలు, వాల్మీకిపురంలో 1500 ఖాతాలు నమోదు చేసినట్లు తెలిపారు. నేడు (ఆదివారం) కూడా ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సుకన్య సంవృద్ధి యోజన పథకం మీ చిన్నారి తల్లుల బంగారు భవితకు కొండంత భరోసాగా ఉంటుందని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ వై.శేషాద్రి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ భాస్కర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

తపాలా బ్యాంకింగ్ సేవలపై అవగాహన

కలికిరి : తపాలా శాఖలో మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నట్లు తపాలా శాఖ తిరుపతి కార్యాలయ సీనియర్ సూపరింటెండెంట్ షేక్ జాఫర్ సాదిక్ అన్నారు. కలికిరి ఇందిరమ్మ కాలనీలో స్థానికులకు తపాలా శాఖలో అందుబాటులో ఉన్న వివిధ రకాల బ్యాంకింగ్ సేవలపై ఆయన వివరించారు. రూ.వందతో ఆర్డీ ఖాతా ప్రారంభించవచ్చని తెలిపారు. ఐపీపీబీ ఖాతాతో డిజిటల్ సేవలు పొందవచ్చని, ఏడాదికి రూ.396తో రూ.10 లక్షల బీమా ఉందని తెలిపారు. తపాలా శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేవలను వివరించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. శనివారం 300 పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలికిరి కార్యాలయ సబ్ పోస్ట్‌మాస్టర్ నిరంజన్ కుమార్, సిబ్బంది సోమశేఖర్, దేవేంద్ర, మధు, ఖాదర్ బాషా, జగదీష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.


పీలేరు రూరల్ : ఖాతాదారులకు ఖాతా బుక్ అందజేస్తున్న ఎస్ఎస్‌పీ జాఫర్‌సాదిక్

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మదనపల్లె : ఎన్నికల విధుల్లో బీఎల్వోల పాత్ర కీలకమని, అందులో నిర్లక్ష్యం వహించినా, పక్షపాతం చూపినా చర్యలు తప్పవని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ హెచ్చరించారు.

స్థానిక సబ్ కలెక్టరేట్‌లో శనివారం మదనపల్లె మండల, అర్బన్‌కు సంబంధించిన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరు పేరు ఓట్ల జాబితాలో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. డెత్ రిజిస్టర్ చూసి చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియని, ప్రతి బీఎల్వో ఇంటింటికీ వెళ్లి తొలగింపు, ఓటరు నమోదుకు సంబంధించిన పత్రాలను తీసుకుని సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఓటర్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియలో ఇప్పటి వరకు కేవలం 75 శాతం మాత్రమే పూర్తయిందని, నెలాఖరులోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.కె.శ్రీనివాసులు, కమిషనర్ కె.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

ప్రతి ఇంటికీ శుద్ధజలం

నిమ్మనపల్లె : జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధజలం అందిస్తామని ఎంపీపీ నరసింహులు అన్నారు. శనివారం మండల పరిధిలోని బండ్లపై గ్రామంలో జలజీవన్‌మిషన్ పథకంపై పోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాన్ని సంస్థ డైరెక్టర్ లలితమ్మ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్, ఎంపీడీఓ లీలామాధవి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా జలజీవన్‌మిషన్ పథకాన్ని చేపట్టామన్నారు. ప్రతి మనిషికీ ప్రతిరోజు 55 లీటర్ల శుద్ధజలం అందించేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యాచరణపై వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో నెలకొన్న సమస్యలను గుర్తించాలన్నారు. పోర్డ్‌సంస్థ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించి అవగాహన కల్పిస్తారని అన్నారు. గ్రామీణ ప్రజలు స్వచ్ఛమైన నీటిని ఉపయోగించాలని, నీటి కుళాయిల పైపులు దెబ్బతినకుండా పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరత్న, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథరెడ్డి, ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ శంకర్, ఐఎస్ఏ కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, జేజీఎం టీమ్‌లీడర్స్ రాధారాణి, పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు



పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి వివాహ వేడుకలు హైదరాబాద్‌లోని ఫిలింనగర్ ఏరియా, జేఆర్‌సీ కన్వర్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ హాజరై, నూతన వధూవరులైన చింతల సాయిక్రిష్ణారెడ్డి, శ్రీయరెడ్డిలను ఆశీర్వదించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, టూరిజం మంత్రి ఆర్‌కే రోజా, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి, విప్ కొరముట్ల శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే, విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, సినీయాక్టర్ అలీ, తెలంగాణ హోంమంత్రి మహమ్మద్ అలీ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, పశుసంవర్థకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషాతో పాటు పీలేరు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

– వాల్మీకిపురం

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పేదలకు వరం


వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కలకడ : వైఎస్సార్ భీమా పథకం పేదలకు వరం అని కలకడ సర్పంచ్ పార్వీజాన్, పంచాయతీ కార్యదర్శి నందిని అన్నారు. కలకడ టౌన్‌కు చెందిన తరిగొండ షేక్ గౌష్‌బాషా ఇటీవల మృతి చెందగా బీమా పథకంలో నామినీగా ఉన్న మృతుడి భార్య అస్మాకు ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరు చేయగా తక్షణ సాయంగా శనివారం రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షావత్‌అల్లీఖాన్, జిలానీబాషా, సచివాలయ సిబ్బంది శ్రీనివాసులు, శ్రీలత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న ఆర్టీసీ అధికారులు

మదనపల్లె సిటీ : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుమారు 600 మందిపైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు రోడ్డుభద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐలు రేవతి, గీత, పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం


సారా ఊట ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం దేవలం తండా పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శనివారం తెలిపారు. నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించి సుమారుగా 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఆమె చెప్పారు.

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ

కురబలకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు పత్రాలను రైతులకు అందజేస్తున్నట్లు తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ముతకనవారిపల్లె రెవెన్యూ గ్రామంలో ఇప్పటికే రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేశామన్నారు. మరో రెవెన్యూ విలేజ్ బ్రాహ్మణ ఒడ్డుపల్లె గ్రామ రైతులకు రెండు రోజులుగా వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో 494 భూహక్కు పత్రాలు సిద్ధం కాగా రైతులకు అందజేస్తున్నామన్నారు. సర్వే నంబర్ల ఆధారంగా భూ మ్యాప్‌లతోపాటు సమగ్ర వివరాలను పొందుపరచడం జరిగిందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా రైతులు భూ రీసర్వే దిగ్విజయంగా నిర్వహించడానికి సహకరించాల్సిందిగా కోరారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. డ్రోన్లపై, ఓఆర్ఐ ఇమేజ్, అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా అత్యాధునిక టెక్నాలజీతో కొలతలు, హద్దులతో రూపొందించడం జరిగిందన్నారు. నకిలీలకు, అక్రమాలకు, భూ వివాదాలకు కూడా ఆస్కారం ఉండదన్నారు.

ముళ్లపొదల తొలగింపు


ముళ్లపొదల తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యం

మదనపల్లె : మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను సర్పంచ్ సుబ్రహ్మణ్యం తొలగించారు. మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలోని దిగువమాచిరెడ్డిపల్లె చెరువుకట్టపై ప్రమాదరకంగా ఉన్న మలుపుల్లో ముళ్లపొదలు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. సమస్యను గుర్తించిన సర్పంచ్ జేసీబీ సాయంతో శనివారం ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

సూర్యకిరణంతో వెలుగు


సూర్యభగవానునికి పూజలు చేస్తున్న అర్చకులు

కలకడ : సూర్యకిరణంతోనే జీవకోటికి ప్రాణం, ప్రపంచానికి వెలుగు సాధ్యమైందని సాయి మందిర ధర్మకర్త సాయిదాసు అన్నారు. శనివారం రథసప్తమి సందర్భంగా మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి మందిరం ఆవరణలో సూర్యభగవానుడి ఆకారంలో ముగ్గులు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. నిత్యం జీవం పోసే దేవా నీకు వందనం అంటూ భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనేక మంది పాల్గొని పూజలు చేశారు.

నవగ్రహాలకు అభిషేకాలు


అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం : మాఘమాసం శుక్లపక్షం రథసప్తమి సందర్భంగా శనివారం స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

శ్రీలక్ష్మీజనార్ధనస్వామి ఉత్సవాల ప్రారంభం

రామసముద్రం : రామసముద్రంలోని శ్రీలక్ష్మీజనార్ధనస్వామి బ్రహ్మరథోత్సవాలు శనివారం రథసప్తమితో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్ భట్టర్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు బ్రహ్మ రథోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. రోజుకొక అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఫిబ్రవరి 5న వైభవంగా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. అలాగే రాత్రివేళ తోమాల సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రూ.14 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.14 కోట్లతో మురికినీటి కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు మండల ఇన్‌చార్జి ఇంజినీరు మదనమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కురబలకోటలో మాట్లాడుతూ వీటికి సంబంధించి 70 పనులు నడుస్తున్నాయన్నారు. 54 మురికినీటి కాలువలు, 16 సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో జెడ్పీటీసీ బైసాని జ్యోతి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నేతృత్వంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధుల కింద ఈ పనులు చేపట్టినట్లు వివరించారు.

రామసముద్రం తహసీల్దార్‌గా దైవరాజన్

రామసముద్రం: రామసముద్రం తహసీల్దార్‌గా దైవరాజన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గత కొంత కలంగా ఇక్కడ డీటీగా ఉన్న వీవీ శాస్త్రీ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దైవరాజన్ సీసీఎల్‌ఏగా విజయవాడలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

31న చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లె : మండల పరిధి వెంగంవారిపల్లె పంచాయతీలోని చేపలచెరువులకు ఈ నెల 31న వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. 18 చెరువులకు వేలంపాటలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ముందుగా గ్రామ సచివాలయంలో రూ.3 వేల ధరావత్తు రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు.

3న మండల ప్రత్యేక సమావేశం

కలికిరి : రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వెలువడిన నోటిఫికేషన్ మేరకు మండలంలో రెండవ మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికకు గాను వచ్చే నెల 3న ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. గతంలో రెండు పర్యాయాలు మండల రెండవ ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా పడింది. ఈ క్రమంలో తిరిగి నోటిఫికేషన్ మేరకు రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి రెండవ వైస్ ఎంపీపీని ఎన్నుకోనున్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి

పెద్దతిప్పసముద్రం : గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానికంగా ఆయన శనివారం మాట్లాడుతూ గ్రామాల్లో ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించి, గ్రామాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల్లో ఎరువుల తయారీ నిర్వహించాలని పేర్కొన్నారు.